మార్చి 6 నుంచి పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు

ఆసిఫాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు మార్చి 6 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నామని జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో ప్రీ ఫైనల్ పరీక్షలను మార్చి 6 నుంచి 15 వరకు నిర్వహించ నున్నామని ఉదయ్‌బాబు తెలిపారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనూర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొద్దుగూడలో గురువారం సీసీడీ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కుంర విఠల్‌రావ్ కందులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు మిత్ర సంఘాల పీల్డ్ అధికారులు నగేష్, బాపూరావ్, రైతు మిత్ర సంఘాల సభ్యులు కుంర దుందేరావ్, కుంర చిన్ను, బాపూరావ్, రైతులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెండు జిన్నింగ్ మిల్లులలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు సీసీఐ ద్వార పత్తి కొనుగోళ్లు నిలిపి వేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈర్షాన్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐలో పత్తి నిల్వలు పేరుకుపోయినందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

పాఠశాల తనిఖీ

సిర్పూర్(యు), జనవరి 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని నేట్నూర్(ఎస్)గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలను గురువారం మహగాం స్కూల్ కాంప్లెక్స్ ఏసీఆర్పీ మండాడి గాగ్రు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సేడ్మకి రామరావు తదితరులు పాల్గొన్నారు.

వినతులు..ఆగ్రహం

- జాబితాల్లో పేర్లు లేవని అధికారుల ఎదుట ప్రజల ఆందోళన
- మూడో రోజూ కొనసాగిన గ్రామసభలు
- నాలుగు పథకాల్లో అర్హుల గుర్తింపునకు మళ్లీ దరఖాస్తులు
- జిల్లాలో 335 పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి



గ్రామసభల్లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు (ఫైల్)

చింతలమానేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజలు వినతులు, ఆవేదనలు, అసంతృప్తులు, ఆగ్రహాలు, నిరసనలు వ్యక్తం చేశారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపిక కోసం మూడు రోజులుగా జిల్లాలోని ఆయా గ్రామాల్లో గ్రామ, వార్డుస భలు అధికారులు నిర్వహిస్తున్నారు. అధికారులు సిద్ధం చేసి వెలువరించిన ప్రాథమిక జాబితాలో తమ పేర్లొచ్చిన వారు ఆనందపడితే పేర్లు లేకపోవడంతో ఆశావహులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కొన్నిచోట్ల అధికారుల ఎదుటే తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మళ్లీ దరఖాస్తు పెట్టుకున్నా తమకు అందుతుందా అని ఆవేదన చెందుతున్నారు.

26 నుంచి పథకాల అమలుకు..

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు ఈ నెల 26వ తేది నుంచి శ్రీకారం చుడుతోంది. ఈ పథకాల కోసం ప్రజలు ఇది వరకే దరఖాస్తులు చేసుకోగా, వాటిపై సర్వే నిర్వహించిన ప్రభుత్వం అర్హులైన జాబితాను రూపొందించింది. ఈ జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఈ నెల 21 నుంచి మూడు రోజులుగా గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తోంది.

అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీలతో పాటు రెండు మున్సిపాలిటీల్లో ఉన్న వార్డుల్లోనూ సభలు నిర్వహించారు. ఈ సభల్లో ప్రధానంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలపై పెద్దగా ప్రజల నుంచి అభ్యంతరాలు తక్కువగానే ఉన్నాయి. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల్లో తమకు అర్హత ఉన్నా జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీస్తున్నారు.

ప్రజాపాలన సందర్భంగా..

ప్రజాపాలన సందర్భంగా రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిగణలోకి తీసుకోకపోవడంతో సదరు కుటుంబీకులు జాబితాల్లో తమ పేరు లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భూములున్న వారు, ఇంతకు ముందే రేషన్ కార్డులు ఉన్న వారి పేర్లు సైతం జాబితాలో ఉన్నాయని, తమ పేర్లు ఎందుకు లేవన్న ప్రశ్నలు అధికారులకు ఎదురయ్యాయి. దీంతో అధికారులు తలలు పట్టుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితానే తాము చదువుతున్నామని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని దరఖాస్తులు సమర్పించాలని గ్రామస్థులకు అధికారులు చెబుతున్నా గందరగోళ పరిస్థితి నెలకొంది. కాగా ఇందిరమ్మ కమిటీల్లో గ్రామంలో ఎవరి ఎవరి పేర్లు చేర్చారో చెప్పాల్సిందిగా అధికారులను గ్రామస్థులు నిలదీశారు. తమకు తెలియకుండానే ఇందిరమ్మ కమిటీలు వేశారని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ గ్రామ కమిటీ రద్దు చేస్తున్నట్లు గ్రామసభలో అధికారులు ప్రకటించాల్సిన పరిస్థితి తలెత్తింది.

15 మండలాల పరిధిలో..

జిల్లా పరిధిలో 15 మండలాలు ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఆయా పథకాలకు 1,19,978 మంది రైతులు ఉన్నారు. 12,570 రేషన్ కార్డులు, 70,618 ఆత్మీయ భరోసా, 49,927 ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులను గుర్తించారు. కాగా చాలా మంది అర్హులుగా ఉండి జాబితాల్లో పేర్లు రాలేదు. దీంతో మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. తమకు అర్హత ఉన్నా జాబితాలో పేరు లేదని, మళ్లీ పరిశీలించి న్యాయం చేయాలని గ్రామసభల్లో చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులందరికీ న్యాయం జరుగుతుందని అధికారులు చెబుతున్నా తుది జాబితా వెలువరించే వరకు తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. జిల్లాలో 22,862 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

అర్హులకు అందేలా చూడాలి..

దోకే రాజన్న, కర్జవెల్లి



అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చూడాలి. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీలను వెల్లడించక పోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే ఇందిరమ్మ కమిటీని రద్దు చేసి గ్రామస్థుల సమక్షంలో అర్హులను ప్రకటించాలి.

అర్హులకు సంక్షేమ పథకాలు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- జిల్లాలో పలు చోట్ల గ్రామసభలు
- పాల్గొన్న అధికారులు



కెరమెరి మండలం కోటారిలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కెరమెరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కెరమెరి మండలం కోటారి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో డీపీవో భిక్షపతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభల్లో చదువుతున్న జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోసారి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతు భరోసా కింద సాగు భూములకు మాత్రమే భరోసా మొత్తాన్ని అందచేస్తామని చెప్పారు. రాళ్లగుట్టలు, వెంచర్లు, ప్లాట్లు లాంటి భూములను గుర్తించామని తెలిపారు. భూమి లేని నిరుపేదలు గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 20 రోజుల పైగా పని చేసిన కుటుంబాలను గుర్తించామన్నారు. వీరికి ఏడాదికి రూ.12 వేలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రతీ ఇంటికి వెళ్లి అధికారులు వివరాలు తీసుకున్నారని చెప్పారు. దీని ప్రకారమే ఇళ్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుం టున్నామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. గురువారం మండలంలోని మాలన్‌గొంది గ్రామ పంచాయతీలో ప్రత్యేకాధికారి పోచయ్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీత తిరుపతి, గ్రామస్థులు పాల్గొన్నారు. . ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని బ్రాహ్మణవాడ, బనార్‌వాడలో నిర్వహించి న గ్రామసభల్లో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, కమిషనర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. గురువారం భట్టుపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకే సంక్షేమ పథకాల్లో పెద్దపీట వేస్తుందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుద్మత విశ్వనాథ్‌రావు అన్నారు.మండలంలోని ధనోర(పి)లో గ్రామసభ నిర్వహించారు. పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ కుమార్, ఎంపీడీవో కృష్ణారావు, మాజీ సర్పంచ్ మెస్రం భూపతి, మాజీ వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, డిప్యూటీ తహసీల్దార్ చిత్రు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండ లంలోని అచ్చెల్లి, చింతకుంట, హీరాపూర్ గ్రామాల్లో ఎంపీడీఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభలు కొనసాగాయి. ఇందులో రేషన్ కార్డు, ఇందిరమ్మ గృహాలు, రైతు కూలి భరోసాకు పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. గ్రామ సభల్లో లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తకర్ర కిషన్‌నాయక్ తండా గ్రామ పంచాయతీలో జైనూరు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులకు పథకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హరిచంద్, మాజీ సర్పంచులు పర్శురాం, దేవిదాస్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అర్హుల జాబితాలో పేర్లు లేని వారు నిరాశ పడకుండా నాలుగు పథకాలకు దర ఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. గురువారం మండలంలోని ఐనం, కోత్మీర్, పీపీరావు కాలనీ, కమ్మర్‌పల్లి, గెర్రె గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి దర ఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లిలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



మాలన్‌గొందిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం కాగజ్‌నగర్ కోయవాగులో కేకే క్రికెట్ టోర్నీ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. గెలిచిన వారు కుంగిపోకుండా గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గెలుపొందిన జట్టుకు రూ.40వేలు, రన్నర్ జట్టుకు రూ.20వేలు నగదును మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మెంబర్ సిద్దిక్, మాజీ కోఆప్షన్ మెంబర్ బాబా, మాజీ ఎంపీటీసీ నాగేందర్, యువ నాయకులు కలీం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

పెంచికలపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండలం ఆగర్‌గూడ గ్రామంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సంజీవ్ సుధాకర్,తిరుపతి, వెంకటాచలం, మారయ్య, రాకేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఆసిఫాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంవీఐ మోహన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని అంకుశాపూర్ రోడ్డు వద్ద అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ రాజమల్లు, ట్రాన్స్‌పోర్టు శాఖ కానిస్టేబుల్ వాజిద్, రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలపై అవగాహన

సిర్పూర్(యు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఆదిలాబాద్ నేహ్రూ యువజన కేంద్రం, ఆసరా స్వచ్ఛంద సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నేహ్రూ యువజన కేంద్రం ప్రాజెక్టు అధికారులు మాజీద్, సురేష్, ఆసరా స్వచ్ఛంద సంఘం అధ్యక్షుడు జిల్లేపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రావణ్ , ఉపాధ్యక్షుడు దావనే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ఆసిఫాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైలులో న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీల హక్కులు, రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జయరాజ్, జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్, బ్రహ్మకుమారి సారిక, న్యాయవాదులు నరహరి, వెంకటేశ్వర్లు, అంజలిదేవి పాల్గొన్నారు.


వేతనాలు చెల్లించాలని వినతి

సిర్పూర్(టి), జనవరి 23(ఆంధ్రజ్యోతి): ధూపదీప నైవేద్యం అర్చకులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని గురువారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ కమిషనర్‌కు డీడీఎన్ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. చర్యలు తీసుకోవాలని కార్యక్రమంలో డీడీఎన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి

సిర్పూర్(టి), జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. గురువారం సిర్పూర్(టి) మండలంలోని అచ్చెల్లి, సిర్పూర్(టి), మేట్‌పల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఈజీఎస్ పథకంలో మంజూరైన రూ.40 లక్షల సీసీ రోడ్లకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు లావణ్య, సత్యనారాయణ, శంకర్, నానయ్య, సాయి, ప్రవీణ్, విలాస్, ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి



మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఎంఐఎం పార్టీ హైదరాబాద్ ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సల్మాన్‌ఖాన్, ప్రధానోపాధ్యా యుడు నిజాం, కార్పొరేటర్ జాఫర్, తాహెర్, అజీముద్దీన్, ఫైసల్, కలాం, షాబాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ వాంకిడి బ్రాంచ్ మెనెజర్ నందకిషోర్ అన్నారు. బ్యాంక్ ఆవరణలో గురువారం సైబర్ నేరాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి వివేక్ చంద్ర, సీఎస్‌పీ భిక్షపతి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మాలల జోలికి వస్తే ఊరుకోం'

చెన్నూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మాలల జోలికి వస్తే ఊరుకోమని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్ అన్నారు. గురువారం చెన్నూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కాష్ఠరపు నవీన్, భూపెల్లి మల్లన్న, రవికుమార్, తిరుపతి, శంకర్, వెంకటస్వామి, కమలాకర్, అశోక్, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'దరఖాస్తులు పరిశీలించడం సరికాదు'

మందమర్రి టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహపథకంతో పాటు రేషన్ కార్డుల దరకాస్తులను అధికార పార్టీ నాయకులు పరిశీలించడం సరికాదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వాసాల సంప త్ అన్నారు. గురువారం 16వ వార్డులో వార్డు సభల వద్దకు వెళ్లి అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు పేదలకు న్యాయం చేయాలని కోరారు.

ఎస్సైకి సన్మానం

తిర్యాణి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను గురువారం తిర్యాణి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా పెంటయ్య

ఆసిఫాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా మాజీ వైస్ ఎంపీపీ మంగ భర్త నుంకరి పెంటయ్యను ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి దోని శ్రీశైలం ఉత్తర్వులు జారీ చేసి గురువారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రహ్లాద్, సురేష్, వెంకటేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కౌటాల మినీ స్టేడియంలో సౌకర్యాలు కరువు

- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



నిరుపయోగంగా మారిన ఇండోర్ స్టేడియం



కౌటాలలోని మినీ స్టేడియం మైదానం

కౌటాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మినీస్టేడియంలో సౌకర్యాలు కరువయ్యాయ్యాయి. నియోజక వర్గంలో ఏకైక మినీస్టేడియం కౌటాల మండల కేంద్రంలో ఉంది. కాగజ్‌నగర్ పట్టణంలో స్టేడియం ఉన్నప్పటికీ ఆ స్టేడియం ఎస్పీఎం కంపెనీకి చెందినది కావడంతో నియోజక వర్గంలో కౌటాల స్టేడియం మాత్రమే అందరికీ అందుబాటులో ఉంటుంది. ఈ స్టేడియానికి ప్రతి రోజు పెద్ద సంఖ్యలో యువకులు వాకింగ్‌తోపాటు పోలీసు, ఆర్మీ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే వారు. సరైన సౌకర్యాలు లేని కారణంగా చాలామంది ఇతర చోట్లకు వెళుతున్నారు. స్టేడియంలో వాకింగ్ ట్రాక్ ఉన్నప్పటికీ మరమ్మతులకు గురవడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు.

క్రీడా సామగ్రి లేక..

క్రీడాసామగ్రి లేకపోవడంతో యువకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో మినీస్టేడియం ఉన్నప్పటికీ సౌకర్యాలు లేనందున క్రీడాకారులు సాధన చేసేందుకు అవస్థలు పడుతున్నారు. గతంలో పోలీసు, ఆర్మీ ఉద్యోగాల కోసం చాలా మంది చుట్టు పక్కల నుంచి వచ్చి ఈ మినీస్టేడియంలో సాధన చేసేవారు. ముఖ్యంగా మహిళలు సాధన చేయడానికి రావడం విశేషం. వారికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతు న్నారు. గతంలో కొన్ని మరమ్మతులు చేసినప్పటికీ ప్రస్తుతం అవి పనికి రాకుండా పోయాయి. దీంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. కౌటాల మినీస్టేడియంను అందుబాటులోకి తీసుకొస్తే ఆణిముత్యం లాంటి క్రీడాకారులు తయారవుతారు. సౌకర్యాలు కల్పిస్తే పోలీసు, ఆర్మీ ఉద్యోగాలకు సిద్ధమయ్యే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీంతోపాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే ఇంకా చాలా మంది యువకులు తమ ఫిటెనెస్‌పై దృష్టిసారించే అవకాశం ఉంది. ఇంకా వాటర్‌ట్యాంను ఏర్పాటు చేసి మరుగుదొడ్లను అందు బాటులోకి తీసుకరావాలని యువత కోరారు. ఇండోర్ గేమ్స్ కోసం ఏర్పాటు చేసిన భవ నంలో క్రీడాసామగ్రిని ఏర్పాటు చేసేందుకు అధికారులు, నాయకులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

సౌకర్యాలు కల్పించాలి..

- నక్క భీంరావు, కౌటాల



మినీ స్టేడియంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి. యువత కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి. క్రీడాకారుల కోసం క్రికెట్, వాలీ బాల్, పుట్‌బాల్, కబడ్డీతోపాటు వివిధ రాకల క్రీడల సామగ్రిని అందజేయాలి.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

● గౌరి శంకర్, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంపీడీవో: గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఆయా గ్రామ పంచా యతీల్లో సమస్యలను గుర్తించి కార్యద ర్శులతో సర్వే నిర్వహించి పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో డ్రైయినేజీ ల్లో పూడిక తీతకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంపీడీవో: గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీల్లో పూడికను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పారిశుధ్య కార్మికులను అప్రమత్తం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వీధి దీపాలు వెలుగని చోట్ల తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంపీడీవో: అన్ని గ్రామాల్లో వీధి దీపాలు ఇప్పటికే ఏర్పాటు చేశాం. మరమ్మతులకు గురైన వాటిని గుర్తించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం.

- బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి)

కాగజ్‌నగర్‌లో అమృత్ 2.0 సర్వే

● మాస్టర్ ప్లాన్ తయారీకి చర్యలు
● మారనున్న పట్టణ రూపురేఖలు
● పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు



డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంటకేష్ దోత్రే, ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అమృత్ 2.0 సర్వే ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అమృత్ 2.0 పథకానికి కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎంపికైంది. ఈ పథకంతో పట్టణ ప్రగతికి బాటలు ఏర్పడనుంది. ఇందుకు గానూ వారం రోజులు డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్నారు. ఈ సర్వేలు పూర్తి అయిన తర్వాత పట్టణ అభివృద్ధి ఏ మేరకు చేయాలి..? చేయడానికి ఎంత నిధులు అవసరమవుతాయి..? అనే కోణంలో అధికారులు నివేదికలను పంపించనున్నారు. దీన్ని కేంద్రం ప్రభుత్వం పరిశీలించి నిధుల విడుదలకు చర్యలు తీసుకోనుంది.

● సర్వేలో భాగంగా..

కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్ 2.0 (పునరుజ్జీవనం మరియు పట్టణ పరివర్తన కోసం అటల్‌మిషన్) పథకం సర్వేలో భాగంగా డిజిటల్ మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తారు. పట్టణ విస్తీర్ణతతో పాటు అటవీ ప్రాంతం, చెరువులు, కుంటలు, నాలాలు, నివాసాలు, కుటుంబాల గుర్తింపుతో కూడిన బేస్ మ్యాప్ సిద్ధం చేస్తారు. ఇందుకు తాగు నీటి సరఫరా వ్యవస్థ మెరుగు పర్చడం, పైపులైన్ వ్యవస్థలకు ఆధునాతంగా మార్చడం, మురుగునీటిని శుద్ధి చేయడం, చెత్త నిర్వహణకు సాంకేతిక పరిష్కారాలు, పారిశ్రామికాభివృద్ధి డేటా సేకరించటం, ఆ తర్వాత డ్రోన్ సర్వేల ద్వారా పట్టణాభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తారు. ప్రధానంగా పర్యావరణ పరిరక్షణ హరిత ప్రాంతాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోనున్నారు. పట్టణ వాసులకు జీవిత ప్రమాణాల పెంపు కోసం ఆరోగ్యకరమైన జీవనశైలికి అవసరమైన వసతులు కల్పించడమే లక్ష్యం. వీటితో పాటు మౌలిక వనరులు అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు పెంచుతారు.

● 30 వార్డుల్లో..

కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో 30వార్డుల్లో డ్రోన్ సర్వేలు కొనసాగుతున్నాయి. కాగజ్‌నగర్ మున్సిపాల్టీ మార్కెట్ ఏరియా, అంతర్గత రోడ్లు, రద్దీ ఉండే ప్రాంతాలు, నివాస గృహాలు, స్లమ్ ఏరియా, ప్రధాన కాల్వ పరిస్థితిపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. రాజీవ్ గాంధీ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, మార్కెట్ ఏరియాలో రద్దీ ఉన్న ప్రాంతాల అభివృద్ధికి తీసుకోనున్న ప్రత్యేక చర్యలపై అధికారులు సర్వేలు చేస్తున్నారు. ఈ సర్వేలు పూర్తి అయిన తర్వాత అధికారులు నివేదికలను సిద్ధం చేయనున్నారు. మరో వారం రోజుల పాటు 30 వార్డుల్లో ఈ సర్వే ప్రక్రియ కొనసాగనుందని చెబుతున్నారు.

అభివృద్ధికి బాటలు..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్ 2.0 పథకం కింద కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎంపిక కావడంతో అభివృద్ధికి బాటలు పడనున్నాయి. ఈ పథకం ద్వారా పట్టణ డిజిటల్ మ్యాప్ రూపొందిస్తారు. అనంతరం స్వచ్ఛ మున్సిపాలిటీగా మారేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అధికారుల నివేదికల ప్రకారమే కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయనుంది.

- డాక్టర్ హరీష్‌బాబు, సిర్పూరు ఎమ్మెల్యే

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



ఆశాలు(ఫైల్)

కాసిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ కాలనీకి చెందిన ఇలాసాగరం ఆశాలు(55) తీవ్ర అనారోగ్య సమస్యలతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌తెలిపారు. ఎస్ఐ, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కూలి పనులు చేసు కుని జీవించే ఆశాలు ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆశాలుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొడు కు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడికి పాల్పడిన నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్

దండేపల్లి, జనవరి23 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంలో స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలో సహకార సంఘం కార్యాలయం వద్ద బుధవారం దంపతుల పంచాయతీలో ఇరువర్గాల మధ్య జరిగిన దాడికి పాల్పడిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ తెలిపారు. దండేపల్లి పోలీసుస్టేషన్‌లో గురువారం ఎస్సై ఉదయ్‌కిరణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన చుంచు లక్ష్మీనారాయణ కూతురు తిరుమలను 2011లో జగిత్యాల జిల్లా ధర్మ పురి మండలం దోనూర్ గ్రామానికి చెందిన ముత్యం కమలాకర్‌తో వివాహం జరిగింది. పెళ్లి అయిన కొన్నేళ్ల తర్వాత కమలాకర్‌కు సింగరేణి ఉద్యోగం వచ్చింది. అతడి భార్యకు పిల్లలు పుట్టడం లేదనే నెపంతో ఆమెను వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో ఆమె రెండేళ్ల క్రితం పుట్టింటికి చేరింది. దీనిపై దండేపల్లిలో పోలీసుస్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బుధవారం ఆమె తండ్రి చుంచు లక్ష్మీనారాయణ దండేపల్లి పోలీసుస్టేషన్ సమీపంలో సహకార సంఘం కార్యాలయం వద్ద దంపతుల ఇరువర్గాల పెద్దమనుషులతో పంచాయతీ ఏర్పాటు చేశారు. ఈ పంచాయతీలో కమలాకర్ తన భార్యను కాపురానికి తీసుకెళ్లేందుకు ఒప్పుకోలేదని పంచాయతీ వాయిదా వేశారు. దీంతో లక్ష్మీనారాయణ ప్రోద్బలంతో మరి కొందరిని పోగు చేసి కమలాకర్ ,ఆయన బంధువులపై దాడి చేసి పారిపోయారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు ముమ్మరంగా గాలించి మంచిర్యాల వైపు రెండు వాహనాల్లో పారిపోతున్న ఐదుగురిని ముత్యంపేట వద్ద పట్టుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడికి పాల్పడిన చుంచు జగదీష్ ,చుంచు రాకేష్, కన్నూరి తేజ, దహగామ లక్ష్మీనారాయణ, పైడిపల్లి రాజుకుమార్ ముత్యం కమలాకర్‌లను అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ కేసులో మరికొంత మంది పాత్ర ఉందని వారినికూడా అరెస్టు చేసి రిమాండ్ చేస్తామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

పింఛన్ డబ్బులు ఇంటి పన్ను కింద జమ

● వెల్లువెత్తిన విమర్శలు..అధికారుల విచారణ

హాజీపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని నంనూర్ గ్రామానికి చెందిన డోరి చుక్కమ్మ పింఛన్ డబ్బులు రూ. 2 వేలను ఇంటి పన్ను కోసం గ్రామపంచాయతీ సిబ్బంది తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ గ్రామంలో విచారణ చేపట్టారు. నంనూర్ గ్రామానికి చెందిన డోరి చుక్కమ్మ, చింత మల్లేశ్వరి, చౌతకారి చంద్రయ్య, బోరె చిన్నయ్యల పింఛన్ డబ్బులను వారి ఇంటి పన్ను కింద నంనూర్ కారోబార్ శ్రీనివాస్ జమ చేసుకున్నాడు. అధికారులు చింత మల్లేశ్వరి, చౌతకారి చంద్రయ్య, బోరె చిన్నయ్యలను విచారించగా తామే తమ పింఛన్ డబ్బులను ఇంటి పన్ను కింద చెల్లించామని పేర్కొన్నారు. డోరి చుక్కమ్మ మాత్రం తన ప్రమేయం లేకుండా ఇంటి పన్ను కింద తన పింఛన్‌ను జమచేసుకున్నారని తెలిపింది. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ మాట్లాడుతూ చుక్కమ్మ పింఛన్ డబ్బులు రూ. 2 వేలను తన ఇష్టం లేకుండా ఇంటి పన్ను కింద జమ చేయడంపై విచారణ చేపట్టామని, సంబంధిత ఉద్యోగులపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

అంగన్‌వాడీలను బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల సఖి కార్యాలయంలో గురువారం జిల్లాలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీవోలకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి కృషి చేస్తుందని చెప్పారు. ఈ క్రమంలో అంగన్‌వాడీలను బలోపేతం చేస్తూ మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, గర్భిణులకు, రక్తహీనత సమస్య ఉన్న బాలింతలకు సేవలు అందించాలని చెప్పారు. సూపర్‌వైజర్, సీడీపీవోలు తమ పరిధిలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. యూనిసెఫ్ ప్రతినరిధులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి సిబ్బందితో సమీక్షించి సూచనలు చేయానలి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, యూనిసెఫ్ ప్రతినిధి రేశాదేశాయ్, సీహెచ్‌సీ, ఈజీఎస్ సంస్థ ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. సూపర్‌వైజర్‌లు, సీడీపీవోలు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించే రిపబ్లిక్ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అన్నారు. గురువారం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు వచ్చే అధికారులకు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. వేడుకల పరేడ్ కమాండర్‌గా ఆర్ఐ పెద్దన్న వ్యవహ రించనున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఆర్ఐలు పెద్దన్న, అంజన్న, ఇన్స్‌పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో చోరీ

కాగజ్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ శ్రీరాంనగర్‌లోని నివాసంటున్న వల్లాల రవి ఇంట్లో గురువారం చోరీ జరిగింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రెండు తులాల బంగారం, రూ.20వేలు అపహరించుకపోయినట్టు రవి తెలిపారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

చింతలమానేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడీహెట్టి, రన్‌వెల్లి గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ మేరకు 60 లీటర్ల నాటు సారా, నాటు సారా తయారీలో వాడే 30 కిలోల బెల్లం, 10 కలోల పట్టికను స్వాధీన పర్చుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. నాలుగు వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఎనిమిది మందిని తహసీల్దార్ మునావర్ షరీఫ్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

పెంచికలపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. అంతకు ముందు ఎల్బారులో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.25.4 కోట్ల రుణ వితరణ చెక్కును మహిళా సమాఖ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం రుణ సౌకర్యాన్ని కల్పిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. ఏడు రోజులుగా సెర్ప్ సిబ్బంది, డీపీవోలు, సీసీలు, ఏపీఎంలు కృషి చేసి బ్యాంకు లింకేజీ ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. మహిళా సంఘాలు బ్యాంకులు అందించిన రుణాలను తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పొర్తెట్టి శ్రీదేవి ఈ నెల 26న ఢిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనడం మహి ళా సంఘాలకు కాకుండా జిల్లాకు గర్వకారణమని అభినందించారు. కార్యక్రమంలో మంచిర్యాల, ఆదిలాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్లు మురళీమనోహర్‌రావు, ప్రమదాస్, జిల్లా గ్రామీణా భివృద్ధి అధికారి దత్తారాం, అదనపు డీపీఎం రామకృష్ణ, డీఆ రపీలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యం సాధించాలి

ఆసిఫాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్దేశించిన బ్యాంకు లింకేజీ లక్షాలను పూర్తి స్థాయిలో సాధించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, ప్రాజెక్టు మేనేజర్ వెంకట్‌లతో కలిసి ఏపీఎంసీసీలతో బ్యాంకు లింకేజీ లక్ష్యాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన బ్యాంకులు ఇంకేది లక్ష్యాలను ఈ నెల 29వ తేదీ వరకు వంద శాతం సాధించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలను తిరిగి బ్యాంకులకు చెల్లించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని వింతగూడ బలగల గ్రామంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రోమి ప్రతిభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ విద్యార్థులకు ఐదో తరగతిలో 60 సీట్లు, ఇతరులకు 20 సీట్లు, 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్ లాగ్ మైనార్టీ సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో మైనారిటీలకు 30, ఇతరులకు 10 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7331170840 నంబరులో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

విధులకు అనుమతించని సూపర్‌వైజర్

● అదృశ్యమైన కాంట్రాక్ట్ కార్మికుడు ● సాయంత్రం తిరిగి రాక ● పనిలోకి తీసుకోవాలని డీజీఎంతో చర్చలు



డీజీఎంతో చర్చిస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ సివిల్ విభాగంలో పనిచేసే సూపర్‌వైజర్ విధులకు అనుమతించకపోవడంతో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు ఆవేదనతో గురువారం ఉదయం అదృశ్యమయ్యాడు. చివరకు సాయంత్రం దొరకడంతో ఉత్కంఠకు తెరపడింది. కాంట్రాక్ట్ కార్మికులు, నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపు శివకాంత్ అనే వ్యక్తి శ్రీరాంపూర్ సివిల్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా ఫ్లంబర్ పనిచేస్తున్నాడు. అనారోగ్యం కారణంగా గత నెలలో విధులకు హాజరు కాలేదు. ఈ నెలలో డ్యూటీకి వచ్చాడు. కానీ గత 15 రోజులుగా సూపర్‌వైజర్ గంగారాం అతడిని విధుల్లోకి తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు చెప్పాలనడంతో వారిని కలిసి ఫోన్ ద్వారా చెప్పించాడు. అయినా డ్యూటీకి అనుమతించలేదు. మూడు రోజులుగా శివకాంత్, తన తల్లి సమ్మక్కతో కలిసి సూపర్‌వైజర్ గంగారాంను విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నా తీసుకోవడం లేదు. గురువారం శివకాంత్, సమ్మక్క వచ్చి విధులకు అనుమతించాలని కోరారు. మీ కాంట్రాక్టర్ వచ్చి లెటర్ రానిస్తేనే తీసుకుంటానని చెప్పాడు. దీంతో విసిగిపోయిన కాంట్రాక్ట్ కార్మికుడు అక్కడి నుంచి తన బైక్‌పై వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, మిగతా కార్మికులు ఎంత వెదికినా ఆచూకీ తెలియలేదు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మ, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జె. శంకర్ రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు అఫ్రోజ్‌ఖాన్, బ్రహ్మానందం, ఇతర నాయకులు అక్కడికి చేరుకొని డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, ఇంజనీర్ గుండేరావు, సూపర్‌వైజర్ గంగారాంతో చర్చించారు. కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలని, సూపర్‌వైజర్‌పై చర్యలు చేపట్టాలని డీజీఎంను కోరారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు మాట్లాడుతూ, సూపర్‌వైజర్ గంగారాం కాంట్రాక్ట్ లేబర్‌ను చులకనగా చూస్తున్నారని, ప్రతి చిన్న విషయానికి వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. సూపర్‌వైజర్ గంగారాంను వేరే ప్రాంతానికి బదిలీ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా శివకాంత్ ఉదయం ఆవేదనతో బసంత్‌నగర్ వైపు వెళ్లిపోయాడని సహచర కార్మికులు పేర్కొన్నారు. చివరకు కుటుంబసభ్యులు గుర్తుకురావడంతో తిరిగి వచ్చాడని, రాత్రివేళ శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద అతని ఆచూకీ లభించిందని వారు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బొమ్మల కొలువులో పాల్గొన్న మహిళలు

మందమర్రి టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థిక ప్రగతిని సాధించాలని సీఎండీ సతీమణి శారద బలరాం తెలిపారు. గురువారం స్థానిక ఎల్లందు క్లబ్‌లో నిర్వహించిన బొమ్మల కొలువు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ బొమ్మల కొలువు అద్భుతంగా ఉందని అన్నారు. పల్లెటూరి వాతావరణం కళ్లకు కనిపించేలా గోశాలలు ఆకర్షణీయంగా నిలిచాయన్నారు. అనంతరం ఆమె బొమ్మల కొలువును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పీపీ సతీమణి సునిత వెంకటేశ్వర్‌రెడ్డి, లేడిస్ క్లబ్ అధ్యక్షురాలు స్వరూపరాణి దేవేందర్, సభ్యులు కవిత, సుజాత, ఊర్మిల, సుప్రియ, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



పన్ను రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి



మాట్లాడుతున్న బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు పెర్క్స్‌పై పన్ను రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి డిమాండ్ చేశారు. ఆర్కే న్యూటెక్ గనిపై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సింగరేణి కార్మికులు దేశానికి విద్యుత్ అందించేందుకు తమ శ్రమను ధారపోస్తున్నట్లు చెప్పారు. వారికి కోల్ ఇండియా కార్మికుల మాదిరిగా ఆదాయపు పన్నుపై రీయింబర్స్‌మెంట్ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కేంద్ర కార్యదర్శి మాదాసు రవీందర్, ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, కోశాధికారి గూడ శ్రీకాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోళ్ల మహేందర్, పిట్ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం శ్రీరాంపూర్ ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, ఓబీ వర్కర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకుడు కొండపర్తి శంకర్, సీఐటీయూ నాయకుడు రాజేష్, బీజేపీ నాయకుడు అగ్గు మల్లేష్, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తుల వెల్లువ

(5వ పేజీ తరువాయి)

పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఎన్ని సార్లు అర్జీలు ఇవ్వాలంటూ ప్రజ లు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

● ప్రాధాన్యతా క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు...

ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరు చేయనున్నారు. మొదట సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు లేని అర్హత గల నిరుపేదలను గుర్తించి-ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింప చేస్తారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత క్రమంలో అత్యంత నిరుపేద అర్హులకు పథకం ఫలాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డుల జారీలో అర్హులైన అభ్యర్థుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోనున్నారు. రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. రైతు భరోసా పథకంలో వ్యవసాయ యోగ్యం కాని రాళ్లు, గుట్టలు, కాలనీలు, ఇండ్ల వెంచర్లు, లేఅవుట్లు, రైల్వే, నాలా భూములు, వివిధ అభివృద్ధి పథకాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములను తొలగించి, సాగు యోగ్యం కల భూములకే రైతు భరోసా అమలు చేయనున్నారు.

తీరిన కరెంటు కష్టాలు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో కాలనీ వాసుల హర్షం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎస్ఈ గంగాధర్

చెన్నూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని 9 వ వార్డులో కొన్నేళ్లుగా వెంటాడుతున్న ఓల్టేజీ సమస్య స్థానిక ఎమ్మె ల్యే వివేక్‌వెంకటస్వామి చొరవతో తీరింది. మూడేళ్ల నుంచి ప్రతి వేసవిలో అధిక లోడ్ కారణంగా సమయం సందర్భం లేకుండా కాలనీలో విద్యుత్ అంతరాయం కలిగేది. దీంతో కాలనీ వాసులు అప్పటి ఏడీ రవి దృష్టికి తీసుకెళ్లి సమస్య వివరించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా సమస్యను ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులకు సమస్యను వివరించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని ఆదేశాలు జారీ చేశారు.

దీంతో అధికారులు ఇటీవల 100 కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ మూడు రోజుల క్రితం ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డుప్రజలు స్థానిక ఎమ్మెల్యేకు, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ బాలకృష్ణ, ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ రమేష్, నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మా సంగతి తేల్చాకే భూములు అమ్ముకోండి



మూసివేసిన పవర్ ప్లాంట్

- శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికుల డిమాండ్
- పవర్ ప్లాంట్ మూతతో రోడ్డున పడ్డ 200 కుటుంబాలు
- సమస్యలు పరిష్కరించకుండానే కంపెనీ భూములు అమ్మేయత్నం
- మూడు రోజులుగా కార్మికుల రిలే దీక్షలు



నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

మంచిర్యాల క్రైం, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాకే కంపెనీ భూములు అమ్ముకోవాలని జిల్లా కేంద్రం రంగపేటలో ఉన్న శాలివాహన పవర్ ప్లాంటు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. రెండేళ్ల కిందట ప్లాంటు విద్యుత్ కేంద్రాన్ని మూసేయడంతో అందులో పని చేస్తున్న 100 మంది శాశ్వత కార్మికులతో పాటు ప్రత్యామ్నాయంగా పని చేస్తున్న మరో వంద మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కంపెనీ మూసివేయడంతో సుమారు 20 ఏళ్లుగా పని చేసిన కార్మికులు ఎక్కడ పని చేయాలో దిక్కు తోచని స్థితిలో పడ్డారు. 2002లో కంపెనీ శంకుస్థాపన చేసిన అనంతరం 2004లో విద్యుత్ ఉత్పత్తి సాధించింది. అప్పుడు సుమారు 32 ఎకరాల భూమిని కంపెనీ కొనుగోలు చేసింది. ఇందుకు గాను కొందరికి శాశ్వత పని కల్పిస్తామని రాసిచ్చింది. అప్పటి ధర ప్రకారం ఎకరం భూమికి 30 లక్షల నుంచి 60లక్షల వరకు చెల్లించి కంపెనీ స్థాపించింది. భూమిని కోల్పోయిన నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగం అని చెప్పడంతో వారు భూమిని కోల్పోవాల్సి వచ్చింది. కంపెనీ 5ఎకరాల భూమిని ఇదివరకే అమ్మేసింది. ప్రస్తుతం కంపెనీ వద్ద 22 ఎకరాల భూమి ఉంది. 2002 సంవత్సరంలో కంపెనీ నడపడం తమవల్ల కావడం లేదంటూ యాజమాన్యం కంపెనీని మూసివేసింది. దీంతో శాశ్వత కార్మికులతో పాటు ప్రత్యామ్నాయ కార్మికులు సైతం వారి పనులను కోల్పోయారు. ఒక్కో కార్మికుడికి సుమారు 40 నుంచి 50 సంవత్సరాలు ఉండడంతో పవర్ ప్లాంటులో పని చేసిన కార్మికులు వేరొక పనిలో ఇమడడం లేదు. ఫిబ్రవరి 2002లో కార్మికులందరు కలిసి వరంగల్‌జోన్ సంయుక్త కమిషనర్ కార్యాలయానికి వెళ్లి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. దీంతో అక్కడి కమిషనర్ మంచిర్యాల లేబర్ కమిషనర్‌కు సిఫార్సు చేశారు. కంపెనీ, కార్మికుల స్థితిగతుల గురించి నివేదిక పొందుపర్చాలని వారు కోరారు. 1947 కార్మికశాఖ చట్టం ప్రకారం కార్మికులకు అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని వారు కోరారు. కంపెనీ యాజమాన్యానికి కార్మికులకు మధ్య చర్చలు జరిగాయి. వారు లక్ష నుంచి రెండు లక్షలు ఇస్తామని అంగీకరించినప్పటికీ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదు. ప్రస్తుతం కంపెనీ భూమిని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని, పది రోజుల క్రితం ఆరున్నర ఎకరాలకు గాను ఎకరానికి రెండు కోట్ల 80 లక్షల చొప్పున భూమిని యాజమాన్యం తీసుకుందని తెలవడంతో ఈ నెల 20 నుంచి కార్మికులు రిలే దీక్షలను చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని, తమకు మద్దతు ఇవ్వాలని, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ రావులను కలిసి విన్నవించుకున్నారు. అయినా వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఈ నెల 31న వరంగల్‌లో చర్చించి సామరస్యంగా పరిష్కరించుకోవడానికి సంయుక్త సమావేశం జాయింట్ కమిషనర్ ఆఫీస్ లేబర్ కార్యాలయానికి వెళ్లాలని తమకు నోటీసు అందిందన్నారు. తమ సమస్య పరిష్కారం కాని పక్షంలో కంపెనీ భూమిలో గుడిసెలు వేసేందుకు సిద్ధమన్నారు.

సమస్యలు పరిష్కరించాకే భూములు అమ్ముకోవాలి...



శాలివాహన పవర్ ప్లాంటు యాజమాన్యం వారి పూర్తి సమస్యలు పరిష్కరించిన తర్వాతనే భూములు అమ్ము కోవాలి. లేని పక్షంలో ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం. కార్మికుల చట్టం ప్రకారం తమ సమస్యలను యాజమా న్యం సానుకూలంగా స్పందించాలి. 20 సంవత్స రాలు పని చేశాం. ఇప్పుడు రోడ్డున పడ్డాం. మమ్మల్ని అర్థం చేసుకొని న్యాయం చేయాలి.

\- కార్మికుల అధ్యక్షుడు కుంటాల శంకర్

నష్టపరిహారం చెల్లించాలి...



శాలివాహన పవర్ ప్లాంటు కంపెనీ యాజమాన్యం తమకు నష్టపరిహారంగా ప్రతీ ఒక్కరికి పది లక్షలు చెల్లించాలి. కంపెనీ కార్మిక చట్టాల ప్రకారం తమకు పరిహారం అందించాలి. పరిహారం అందించిన తర్వాతే కంపెనీ భూములను అమ్ముకోవాలి. భూమిని అమ్మినప్పటికీ అమ్మలేదని మమ్మల్ని మభ్యపెడుతున్నారు. స్థా నిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని మాకు న్యాయం చేయాలి.

\- అసరి రాజయ్య

చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నాం...

లేబర్ యాక్టు ప్రకారం వ్యవహరిస్తున్నాం. భూమికి సంబంధించి కేసు లేబర్ కోర్టులో ఉంది. మొత్తం కం పెనీకి పది ఎకరాల భూమి ఉంది. ఇండస్ట్రియల్ యా క్టు ప్రకారం కార్మికులకు నష్టపరిహారం చెల్లిస్తాం. కొం దరు కావాలనే దురుద్దేశంతో పెద్ద మొత్తంలో డబ్బులు కావాలని నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు మేం భూమి అమ్మలేదు.

\- కంపెనీ డైరెక్టర్ మల్క నవీన్

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష

గర్మిళ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అజాగ్రత్తగా లారీ నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నిరోషా ఏడాది జైలు శిక్షను విధిస్తూ తీర్పిచ్చినట్లు పట్టణ సీఐ ప్రమోద్ రావు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన వెలగపూడి శివరామకృష్ణ అనే వ్యక్తి 2019 ఆగస్టు 10వ తేదీన తన మనమరాలు ముప్పాల నివేదితో మంచిర్యాల నుంచి రామకృష్ణాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా శ్రీనివాసగార్డెన్ సమీపంలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన సంజయ్ శంకర్ అనే లారీ డ్రైవర్ బెల్లంపల్లి వైపు నుంచి మంచిర్యాలకు వస్తూ శివరామకృష్ణ, నివేదిత వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో శివరామకృష్ణ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడిన నివేదిత మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసి చార్జీషీటు దాఖలు చేశారు. గురువారం నిందితున్ని కోర్టులో హాజరుపర్చగా విచారించిన న్యాయమూర్తి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ సంజయ్‌శంకర్‌కు యేడాది జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

గూడెం దేవస్థానికి బారికేడ్ల అందజేత

దండేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీరామా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానానికి మహా సిమెంట్ పై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో రూ. రెండున్నర లక్షల విలువ గల 20 బారీకేడ్లు సంస్థ ప్రతినిధులు అంద జేశారు. గురువారం 20 బారీకేడ్లులను మహా సిమెంట్ సంస్థప్రతినిధిసినియర్ రీజనల్ మేనేజర్ ఆర్ ప్రదీప్, నిజామాబాద్ రీజనల్ మేనేజర్ వి శ్రీనివాస్‌రావు, నాన్ ట్రెడ్ సీనియర్ మేనేజర్ పి మహేష్‌కుమార్, మహా సిమెంట్ ముత్తె సురేష్‌లు ఆలయ అధికారులకు బహూకరించారు. ముందుగా కంపెనీ ప్రతినిధులు సత్యదేవున్ని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో వారిని స్వామి వారి శేషవస్త్రాలతో ఘనంగా సత్కారించారు. వారికి స్వామి వారి చిత్రప టం బహూకరించి స్వామి ప్రసాదంను అం ద జేసి ఆలయ అర్చకులు స్వామి వారి ఆశీర్వచనం అందజేశారు.

ఎంపీవోపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన కార్యదర్శులు

బెల్లంపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ ఎంపీవో జి. అనిల్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు మండల సమస్త పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందించారు. కార్యదర్శులు మాట్లాడుతూ ఎంపీవో సమావేశాల్లో దూషించడం, హేళన చేయడం, అసభ్య పదజాలంతో తిట్టడం చేస్తున్నాడని ఎమ్మెల్యేతో ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా వాట్సాప్ గ్రూపు కాల్స్ చేస్తూ హేళనగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో కొత్త ప్లాంట్ నిర్మాణం కోసం

ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకించాలి

గర్మిళ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీలో ఐదు కోట్ల టన్నుల సైచిలుకు బొగ్గు కాల్చివేత జరుగుతుందని, ఎన్టీపీసీలో ఏర్పాటు చేయబోయే మరో యూనిట్ కోసం ఈ నెల 28న ప్రభుత్వం చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వ్యతిరేకించాలని పర్యావరణ వేత్త ఉమామహేశ్వర్, సంస్థ అధ్యక్షుడు మల్లయ్య పిలుపునిచ్చారు. రామగుండంలో ఎన్టీపీసీ ఏర్పాటు చేయబోతున్న 2400 మెగావాట్ల కొత్త ప్లాంట్ నిర్మాణంతో మంచిర్యాల ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటుందని స్వచ్ఛంద పౌర సేవా సంస్థ నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్లాంటు వల్ల కలిగే కాలుష్యం గురించి ముద్రించిన కర పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమలో పర్యావరణ వే త్త ఉమామహేశ్వర్, సంస్థ అధ్యక్షుడు మల్లయ్య ప్రధాన కార్యదర్శితుల మధుసూదన్‌రావు, ప్రదీప్, రాధేశ్యామ్, కైలాసం, ఐరుపతి, రామచంద్రరెడ్డి, న్యాయవాదులు లచ్చన్న, నందాని, అర్జున్, గణేష్, బీసీ జాగృతి అధ్యక్షుడు శ్రీనివాస్, రంజిత్, సత్యం, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

మందమర్రి మున్సిపల్ ఎన్నికలు జరిపించండి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి

మందమర్రిటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించాలని కోరుతూ గురువారం కేంద్రం హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు మందమర్రిమున్సిపల్ ఎన్నికల సాధన సమితి నాయకులు వినిత పత్రం అందించారు. కరీంనగర్‌లోని బండి సంజయ్ నివాసంలో కలిసి ఎన్నికలు లేకపోవడం వల్ల అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. పాలకవర్గం ఏర్పడితే పట్టణాభివృద్ధి జరుగుతుందని విన్నవించారు. త్వరగా ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. కమిటీ కన్వీనర్ అందుగుల శ్రీనివాస్, కో కన్వీనర్లు మేడిపల్లి సంపత్, దీక్షితులు, సూరిబాబు, లక్ష్మణ్‌నరేష్, మాయరమేష్, కొంగల తిరుపతి రెడ్డి, ఆర్‌వెంకన్న, రాజశేఖర్,రాజనర్సు రవి, సాగర్, వెంకన్న, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్స్ అప్పగించిన ఎస్సై

లక్షెట్టిపేట, జనవరి23 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కొంతమంది సెల్‌ఫోన్స్ పోగొట్టుకోగా ఎస్సై రామయ్య బాధితులకు గురువారం అందించారు. సీఈఐఆర్ ఆప్‌ద్వారా బాధితులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక పోలీసులు వాటిని ఛేదించి రంగపేటకు చెందిన ఆవునూరి శ్రీనివాస్, దొడేపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ సమ్మిరెడ్డిలకు మొబైల్స్ అందించారు. పీసీలు రవికుమార్, ప్రేమ్, రమేష్‌లను ఎస్సై అభినందించారు.

నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే చేయూత

దండేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలైన సుద్దాల రాములు, జిల్లాపెల్లి శ్రీనివాస్, మర్సుకోల చందు, జుల లక్ష్మయ్యలు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి రూ.5వేల చొప్పున రూ.20వేల రూపాయాలను స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పంపించి వారికి అండగా నిలిచారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ నాయకులు గొట్ల మహేందర్, ఆరెపల్లి రమేష్, జిల్లాపెల్లి భానుచందర్, బలికొండ రాజన్న, అంజిరాల రాజు, బూక్యా రవి, లెంకది శేఖర్‌లు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్



ఆకెనపల్లి గ్రామసభలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్‌కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని ఆకెనపల్లి గ్రామంలో గ్రామసభకు వారు హాజరై మాట్లాడారు. ఎవరైనా అర్హులైన వారు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోకుండా ఉండే గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సభలో చదివిన అర్హుల జాబితాలో పేర్లు రానివారు చేసుకునే దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత క్రమంలో అత్యంత నిరుపేదలు, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్‌కార్డు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, తహసీల్దార్ జ్యోత్స్న పాల్గొన్నారు.

ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

మంచిర్యాల క్రైం : మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, వార్డు కౌన్సిలర్ పూదరి సునీత ప్రభాకర్, ఆర్ఐ అజీజ్, వార్డు ఇన్‌చార్జి ఆఫీసర్ మధు, టీపీఎస్ రాజ్‌కుమార్, వార్డు ఆర్పీలు కృష్ణవేణి, పరీష్, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు.

దండేపల్లి: ప్రజలు ఎవరు సంక్షేమ పథకాలు రావడం లేదని ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రజ లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్ అన్నారు. దండేపల్లితో పాటు తాళ్లపేట, మేదరిపేట, లింగాపూర్, మామిడిపల్లి, పెద్దపేట, లక్ష్మికాంతపూర్, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్, నంబాల గ్రామాలోని గురువారం జీపీ కార్యాలయాల్లో ప్రజా పాలనలో భాగంగా మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారుల సమక్షంలో సంక్షేమ పథకాల ఎంపిక కోసం గ్రామ సభ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డుల పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకే దండేపల్లి మండలంలోని మూడు రోజుల నుంచి జరుగుతున్న గ్రామసభలు ప్రశాంతంగా ముగిశాయి.

భీమారం : మండలంలోని 11 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో మొత్తం 542 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో మధుసూదన్ గురువారం తెలిపారు. అర్హులైనా పేరు లిస్టులో లేకుండా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని, చిన్న చిన్న పొరపాట్ల వల్ల లిస్టులో రాకపోయి ఉండొచ్చన్నారు. అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

భీమిని: గ్రామంలో అర్హత ఉన్నవారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీడీవో గంగ మోహన్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నతిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, మాజీ సర్పంచు ఇందూరి భూమయ్య, ఏఈవో కార్తీక్, కార్యదర్శి తిరుపతి, టీఏ నాగేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేమనపల్లి : వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో గందరగోళం నెలకొంది. అధికారులు గ్రామసభ నిర్వహిస్తుండగా గ్రామంలో అర్హులైన వారికి ఆత్మీయ భరోసా పథకం అందకుండా పోయిందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ఏట మధుకర్ అధికారులను నిలదీశాడు. మధుకర్ మాట్లాడుతూ నీల్వాయి గ్రామంలో రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా జాబితాలో అర్హుల పేర్లు రాలేదన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పేర్లు జాబితాలో పేర్లు వచ్చాయని విమర్శించారు. ఈవిషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఏపీవో సత్యప్రసాద్ మాట్లాడుతూ జాబితాలో ఉన్న పేర్లనే సభలో వివరించామని తెలిపారు. జాబితాలో పేరు రాని అర్హులు పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి



సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఐ

బెల్లంపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : టేకుల బస్తీలోని ఆక్స్‌వర్డ్ గ్రామర్ స్కూల్‌లో గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, కౌన్సిలర్ ఎలిగేటి శ్రీనివాస్‌లు హాజరై సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేగుంట రాయలింగు, బొలిశెట్టి సుధాకర్, ఆనంద్, వార్డు పెద్దలు రాజనర్సు, రాజేందర్ పాల్గొన్నారు.

నస్పూర్ : నస్పూర్ పట్టణంలోని నర్సయ్య భవన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మన్, నాయకులు గరిగె విజయ్, ఎండి మహబూబ్, శంకర్, ఎస్‌కే సిరాజ్ పాల్గొన్నారు.

గర్మిళ్ల : మంచిర్యాల పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ మైదానంలో ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు రామన్న, అధ్యక్షులు దాసరి కుమార్,తుల అంజనేయులు, చంద్రకాంత్, మహేందర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

తాండూర్ : రేచిని రైల్వేస్టేషన్ రోడ్డులోని సేవా జ్యోతి శరణాలయంలో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీదేవిమల్లేశం, గజెల్లి నరశ, శరణాలయంలోని మహిళలు పాల్గొన్నారు.

●భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏమర్ల ప్రదీప్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా శాఖ సహకారంతో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, తాండూర్ సీఐ కుమారస్వామిలు హాజరై సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 101 మంది రక్తదాతలతో 101 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు అలినవ సంతోష్‌కుమార్ తెలిపారు. క్యాంపు నిర్వాహకుడు ఏమర్ల ప్రదీప్, సుమంగళి ఫంక్షన్ హాల్ యాజమాని, డాక్టర్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు మామిడి విగ్నేష్, సుధీర్‌గౌడ్, పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణం కోసం స్థల పరిశీలన

కన్నెపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణం కోసం స్థలాన్ని గురువారం డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ పరిశీలించారు. కన్నెపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం పరిశీలించారు. ఆయన వెంట సీహెచ్‌వో జ లపతి, పాక్స్ వైస్ చైర్మన్ ఆకు తోట రాజన్న, వైద్య సిబ్బంది ఉన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉపాధి కల్పన కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు నిరుద్యోగ యువతకు మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 7013188805, 9110368501 లో సంప్రదించాలన్నారు.

నియామకం

కాసిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) :మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా అక్కెపల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో నారాయణ, తిరుపతి, సతీష్, భీమయ్య, కిషన్ పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

హాజీపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆరు నెలల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందిన ముల్కల్ల గ్రామానికి చెందిన గోనె రమ్య కుటుంబ సభ్యులకు బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజ శేఖర్ రమ్య భర్త శేఖర్‌కు రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. రమ్య ముల్కల్లలోని జీవన జ్యోతి గ్రామ సంఘంలో సభ్యురాలుగా ఉన్నప్పుడు పీఎం జీఈవన జ్యోతి భీమా యోజన కింద ప్రీమియం రూ. 436, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ప్రతి సంవత్సరం చెల్లించింది. ఆమె మరణానంతరం కుటుంబ సభ్యులు భీమా క్లెయిమ్ చేశారు. గురువారం కార్యక్రంలో బ్యాంకు క్యాషియర్‌లు మల్లయ్య, మానస, సీవోఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలు

చెన్నూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం వేమనపల్లి మండలంలోని కల్లంపల్లి గ్రామానికి చెందిన పది మందికి ఉచిత కంటి ఆపరేషన్‌లు చేసినట్లు వైద్యుడు అభిషేక్ చిందం తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు బండారి రాజేశ్వరి, ట్రస్టు వ్యవస్థాపకులు లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు (ఫైల్)

మా సంగతి తేల్చాకే భూములు అమ్ముకోండి

- శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికుల డిమాండ్
- పవర్ ప్లాంట్ మూతతో రోడ్డున పడ్డ 200 కుటుంబాలు

7


డ్రోన్ సర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్‌లో అమృత్ 2.0 సర్వే

- మాస్టర్ ప్లాన్ తయారీకి చర్యలు
- మారనున్న పట్టణ రూపురేఖలు
- పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు

6

సంక్షేమ పథకాలకు దరఖాస్తుల వెల్లువ



- ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులకు డిమాండ్
- ఆశావహుల నుంచి భారీ స్పందన
- ప్రాధాన్యతా క్రమంలో పథకాల అమలు
- నేటితో ముగియనున్న ప్రజాపాలన సభలు..

మంచిర్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గ్రామ, వార్డు సభలు శుక్రవారంతో ముగియనున్నాయి. మూడు రోజులుగా ప్రజాపాలన సభల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా కోసం అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాల ఫలాలకు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించే ఉద్దేశ్యంతో గ్రామ, వార్డు సభలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమం కింద స్వీకరించిన దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించేందుకు ప్రజల సమక్షంలో సభలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తు చేసుకోనివారు, చేసుకున్నా జాబితాలో పేర్లు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిరసనలకు దిగుతున్న ఆశావహులు..

గ్రామ, వార్డు సభల సందర్భంగా అధికారులు విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు లేవంటూ చాలాచోట్ల దరఖాస్తుదారులు నిరసనలకు దిగుతున్నారు. దీంతో అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటోంది. బెల్లంపల్లి, భీమారం, కోటపల్లి, భీమిని, జన్నారం తదితర మండలాల్లో ప్రజలు నిరసనలు తెలియజేశారు. మొక్కుబడిగా సభలు నిర్వహిస్తున్నారంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అనర్హులను ఎంపిక చేశారంటూ విమర్శలు రావడంతో అప్రమత్తమైన కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, ఇతర జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించారు. ఎక్కడైనా అర్హులు ఉండి జాబితాలో పేర్లులేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తుండటంతో శాంతిస్తున్న ప్రజలు పెద్దమొత్తంలో అర్జీలు అందజేస్తున్నారు.


మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్

వెల్లువలా దరఖాస్తులు..


రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం జిల్లా ప్రజల నుంచి అర్జీలు వేలాదిగా వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలకోసం అర్హుల జాబితాను ఆయా గ్రామాలు, వార్డు ప్రజాపాలన సభల్లో అధికారులు వెల్లడిస్తున్నారు. సభలను ఈ నెల 24లోపు పూర్తిచేసి 26నుంచి అర్హులకు పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. కొత్తగా స్వీకరించిన దర ఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి కాగానే అర్హులకు పథకాలను వర్తింపజేయనున్నారు. గ్రామ, వార్డు సభల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసమే వినతులు అధికంగా వస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ఇప్పుడు వాటికి దరఖాస్తు చేసేందుకు ఆశావహులు క్యూలు కడుతున్నారు. జిల్లాలో మొత్తం 311 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు 272 వరకు గ్రామ సభలు నిర్వహించారు. అలాగే ఏడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 155 వార్డులు ఉండగా ఇప్పటి వరకు 111 వార్డు సభలు నిర్వహించారు. ప్రజా పాలన సభల ద్వారా కొత్తగా 49,341 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు చెబుతున్నారు.

తప్పుల తడకలుగా జాబితాలు....

గ్రామ, వార్డు సభల్లో అధికారులు విడుదల చేస్తున్న అర్హుల జాబితాలు తప్పుల తడకలుగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అష్టకష్టాలు పడి ప్రజాపాలనలో దరఖాస్తులు అందజేస్తే, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తప్పులు దొర్లాయంటూ వాపోతున్నారు. అధికారులను నిలదీస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడంపైనా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రజాపాలన, సామాజిక ఆర్థిక రాజకీయ కుల గుణన సమయంలోనూ వివరాలు వెల్లడించారు. మళ్లీ దరఖాస్తులు ఇవ్వాలంటూ కోరడంతో అసహనం నెలకొంది. ప్రజాపాలన కార్యక్రమాల్లోనే రెండుసార్లు దరఖాస్తులు తీసుకోవడం, గతంలోనూ మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్‌లలోనూ రేషన్‌కార్డుల కోసం చేసిన దరఖాస్తులు పెద్దమొత్తంలో.

మిగతా 7లో

ప్రతీ ఒక్కరికి పరిహారం


బాధితుల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల వరంగల్ ఖమ్మం విజయ వాడ జాతీయ రహదారి 163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితుల వివరాలను ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ రహదారి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. మొదటి జాబితాలో పరిహారం అందని వారు సంబంధిత పత్రాలు, బ్యాంకు పాస్ పుస్తకాలతో సంప్రదిస్తే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు తేలితే పరిహారం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారు లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

భీమారం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక ఎస్‌ఐ శ్వేత రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అవగాహనకల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. విద్యార్థులు రోడ్డు భద్రతపై తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అలాగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. అలాగే విద్యార్థులు టీవీలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి కవ్వాలలో పక్షుల సర్వే

జన్నారం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో పక్షుల సర్వే ప్రారంభం కానుంది. ఈ నెల 26 వరకు పక్షుల సర్వే నిర్వహించనున్నారు. ఈ పక్షుల సర్వే అటవీ డివిజన్‌లో పక్షుల గురించి తెలుసుకోవడమే కాకుండా వాటి లక్షణాలు, అవి ఏ ప్రాంతానికి చెందినవని పూర్తి స్థాయిలో తెలియనుంది. విభాగాలుగా

● జన్నారం డివిజన్‌లోని 40 బీట్‌లలో సర్వే జరపనున్నారు. ప్రతి బీట్‌లో 3 కిలోమీటర్ల పరిధి తీసుకుని అందులో వాటర్ బర్డ్స్‌తో పాటు సాధారణంగా తిరిగే పక్షుల సర్వే చేయనున్నారు.

పత్తి కొనడం లేదని రైతుల రాస్తారోకో

ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలు

చెన్నూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయడం లేదంటూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు గురువారం రాస్తారోకో చేపట్టారు. మండలం లోని కిష్టంపేట, వరలక్ష్మీజిన్నింగు మిల్లు వద్ద చెన్నూరు-మంచిర్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి గంట పాటు ఆందోళన చేపట్టారు. సంబంధిత అధికారులు వివిధ కారణాలతో పత్తిని కొనుగోలు చేయడం లేదంటూ రైతులు వాపోయారు. రెండు రోజుల నుంచి జిన్నింగు మిల్లు వద్ద పత్తి వాహనాలతో ఉన్నప్పటికీ పత్తిని కొనుగోలు చేయకపోవడంలో అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. అదే దళారులు తీసుకువచ్చిన పత్తిని కొనుగోలు చేస్తున్నారని రైతులు తీసుకువచ్చిన పత్తికి అడ్డగోలు నిబంధనలు పెడుతున్నారని అన్నారు. అధికారుల తీరుకు వ్యతిరేకంగా గంట పాటు ఆందోళన చేపట్టడంతో ఎటు వాహనాలు అటే నిలిచిపోయాయి. ఈ విషయంపై మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులును సంప్రదించగా అన్ని మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోయాయని అందుకే కొనుగోళ్లు నిలిపివేశామని పేర్కొన్నారు. వరలక్ష్మీ కాటన్ మిల్లు వద్ద ఉన్న వాహనాలను వేరే మిల్లుకు పంపించి పత్తి కొనుగోళ్లు యధావిధిగా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కావద్దన్నారు.


పత్తి మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

శిథిలావస్థలో బస్‌షెల్టర్

- భక్తులకు తప్పని తిప్పలు
- చెట్టు కింద నిలబడి వాహనాల కోసం ఎదురు చూపులు

దండేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం గ్రామం ఒక పుణ్యక్షేత్రం...మూడు దేవాలయాలు సమాహారం. ఇక్కడికి నిత్యం వివిధ జిల్లాల నుంచి వందలాది మంది భక్తులు గూడెం దేవస్థానానికి దర్శనంకోసం వస్తుంటారు. ప్రతీ నెల దేవస్థానంలో పౌర్ణమి జాతరకు వేలాది మంది భక్తులు గూడెం సత్యదేవున్ని దర్శనం చేసుకుంటారు. దర్శనం పూజలు అనంతరం తిరిగి వెళ్లిడానికి ఆలయ సమీపంలో బస్సు వచ్చే వరకు సేదతీరుదామంటే కనీసం బస్‌షెల్టర్ లేకపోవడంతో వచ్చే భక్తులకు ఇబ్బందిగా మారింది. శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న ప్రధాన రహదారి పక్క నఉన్న బస్‌షెల్టర్ పూర్తిగా శిథిలమైపోయింది. ఏళ్లు గడుస్తున్నా సంబంధితశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు చెట్టు కింద ఉంటూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉన్న హోటల్‌లో దుకాణాల్లో కూర్చుని పడిగాపులు కాయాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్య క్తం చేశారు. కొన్నాళ్ల క్రితం భక్తుల సౌకార్యం కోసం ఓకంపెని స్వచ్ఛంద సంస్థ వారు బస్‌షెల్టర్ నిర్మించారు. అది ఇప్పుడు పూర్తిగా శిథిలమై కూలడానికి సిద్దంగా ఉంది. శిథిలమైన బస్‌షెల్టర్‌ను తొలగించి కొత్త బస్ షెల్టర్‌ను నిర్మించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దేవస్థానం వారుగాని దాతల సహకారంతో, ఇతర వ్యాపార సంస్థలు ముందుకు వచ్చి నూతన బస్‌షెల్టర్ నిర్మించేలా కృషి చేయాలని కోరుతున్నారు.


గూడెం గుట్ట దేవాలయం సమీపంలో ఉన్న శిథిలమైన బస్‌షెల్టర్


గూడెంగుట్ట వద్ద ఓ చెట్టు కింద నిలబడి బస్సుల కోసం వేచి చూస్తున్న భక్తులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

- సీఐ సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

శ్రీరాంపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంచిర్యాల ట్రాఫిక్ సీఐ బి. సత్యనారాయణ అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గనిపై గురువారం రోడ్డు భద్రతా, ట్రా ఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. మద్యంతాగి వాహనాలు నడుపవద్దని, ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని సూచించారు. గని మేనేజర్ ఈ. తిరుపతి మాట్లాడుతూ, గనుల్లో రక్షణను ఎలా పాటిస్తామో, రక్షణపరికరాలు ఎలా ధరిస్తామో, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, ఉద్యోగులు గొర్రె నర్సయ్య, కారుకూరి నగేష్, కిన్నెర చంద్రమౌళి, శ్రీనివాస్, సంపత్, సాయిబాబా, క్రాంతి, పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మైనార్టీ గురుకుల విద్యార్థి మృతి


ఆదర్శ్ (ఫైల్)

చెన్నూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అనుమానాదస్పద స్థితిలో గురువారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు, పాఠశాల యాజమాన్యం వివరాల ప్రకారం.. చెన్నూరు మండలంలోని బీరెల్లి గ్రామానికి చెందిన మారగోని ఆదర్శ్ (15) పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల కోసం ఈ నెల 10న ఆదర్శ్ గురుకులం నుంచి ఇంటికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు. ఈ విషయం ఆదర్శ్ తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందికి ఫోన్ చేసి తెలిపారు. ఆదర్శ్ రాత్రి వరకు పాఠశాలకు చేరుకోకపోవడంతో సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు గురువారం ఉదయం చెన్నూరుకు చేరుకున్నారు. అప్పటికే సమీకృత మార్కెట్ భవనంలో గుర్తు తెలియని బాలుడు మృతి చెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అక్కడ లభించిన బ్యాగు, ఐడెంటిటీ కార్డుల ఆధారంగా మండలంలోని బీరెల్లి గ్రామానికి చెందిన మారగోని ఆదర్శ్‌గా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలంలో లభించిన ఆధారాల ప్రకారం ఆదర్శ్ క్రిమిసంహారక మందు తాగి మృతిచెందినట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తమ కుమారుడిని అదే తరగతికి చెందిన కొంత మంది విద్యార్థులు వేధిస్తున్నారని ఆదర్శ్ తల్లిదండ్రులు తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన తమ కుమారుడు పురుగుల మందు సేవించి మృతి చెంది ఉంటాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోపిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి

- మందకృష్ణ మాదిగ


సోమగూడెంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కాసిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రాల సీఎంలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం సోమగూడెం ఎమ్మార్పీఎస్ నాయకులు కల్వల లక్ష్మణ్ అనారోగ్యంతో ఉండడంతో ఆయను పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా దాని అమలు కోసం మరో పోరాటం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాటకు కట్టుబడకుండా మాదిగలకు అన్యాయం చేశారని ఆరోపించారు. మాదిగలకు ఇచ్చిన మాట కోసం సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వచ్చి వర్గీకరణ చేస్తారని ఆశిస్తున్నా మన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం, జరుగుతున్న కుట్రలను ఎ దుర్కోవడం కోసం ఫిబ్రవరి 7న హైద్రాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి మదిగలు డప్పులతో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ బుర్రి సతీష్ మాదిగ, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, నాయకులు జిలకర శంకర్, దాసరి రాంచందర్, శరత్ పాల్గొన్నారు.

మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించాలి

- కలెక్టర్‌కు ఎన్నికల సాధన కమిటీ సభ్యుల వినతి

మందమర్రి టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించి పాలక వర్గం ఏర్పడేలా చూడాలని గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఎన్నికల సాధన కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలెత్తుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీల్లో రెండు దశాబ్దాలుగా ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఎన్నికలే ఏకైక లక్ష్యంగా పట్టణంలోని అన్ని కుల, ప్రజా సంఘాలతో పార్టీలకతీతంగా సాధన కమిటి ఏర్పాటు చేశామని వారు చెప్పారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధన కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో చోరీ

దండేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన మెటపల్కుల గురువయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గురువయ్య భార్య శోభారాణి లక్షెట్టిపేట మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. ఈనెల 19న ముత్యంపేట నుంచి లక్షెట్టిపేట వెళ్లారు. ముత్యం పేట ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని ఇంటి పనిమనిషి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో గురువయ్య వచ్చి చూడగా ఇంట్లోని 24 గ్రాముల డైమండ్ నెక్లెస్‌తో పాటు 50 వేల నగదు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.